క్లుప్తంగా

పేద పిల్లలకు సామూహిక వడుగులు



పిల్లల తల్లిదండ్రులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న పీఠాధిపతి గౌస్‌పీరా ఖాద్రీ

జమ్మలమడుగు రూరల్‌ : పేద పిల్లలకు వడుగులు నిర్వహించడం పుణ్య కార్యం అని అస్థాన గౌసియా దర్గా పీఠాధిపతి సయ్యద్‌ షా గౌస్‌పీరా ఖాద్రీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గౌసియా షాదీఖానాలో సయ్యద్‌ షా గౌస్‌పీరా ఖాద్రీ (పెద్ద అస్థానము) 92వ ఉరుసు మహోత్సవం సందర్భంగా కార్వానే అహలేబైత్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 80 మంది ముస్లిం పేద పిల్లలకు ఉచితంగా వడుగులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు సందర్భంగా ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఉచితంగా సామూహిక వడుగులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం వడుగులు చేయించుకున్న పిల్లలకు ఉచితంగా 5 కేజీల గోధుమపిండి, చక్కెర, బెల్లం, నెయ్యి, చార్జీల కోసం రూ.100 ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌ షా తాహీర్‌పీరా ఖాద్రీ, అతహర్‌ ఖాద్రీ, సయ్యద్‌ షా సాబిర్‌ ఖాద్రీ, కమిటీ సభ్యులు ఎస్‌.మహమ్మద్‌ గౌస్‌, చాపాడు మహమ్మద్‌ గౌస్‌, జహంగీర్‌ బాషా, దాదాపీర్‌ ఎంఎం బాషా, అబ్దుల్‌ రజాక్‌, యూత్‌ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లికి పాదపూజ



అమ్మకు కాళ్లు కడిగి పూజ చేస్తున్న చిన్నారులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని కోదండ రామాలయంలో గ్రేటర్‌ వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో తల్లికి పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పురాతన కోదండ రామాలయంలో గ్రేటర్‌ వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో తల్లికి వందనం పేరిట తల్లులకు పాద పూజ నిర్వహించారు. తల్లికి తమ పిల్లలు సాంప్రదాయ బద్ధంగా కాళ్లు కడిగి ఆశీర్వాదం పొందారు. తల్లి ద్వారానే తమకు ఈ సమాజం పరిచయం అయిందని, తల్లి లేనిదే తాము లేమని, తల్లి పిల్లలపై చూపించే ప్రేమ అద్వితీయమైనదని చిన్నారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్‌ సభ్యులు సుబ్రమణ్యం, గోపాలక్రిష్ణ, సుధాకర్‌, శేఖ పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆట-పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక అఖిల్‌ డ్యాన్స్‌ అకాడమి ఆధ్వర్యంలో చిన్నారులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. వారు ప్రదర్శించిన కామెడీస్కిట్లకు ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. శిల్పారామం రాష్ట్ర ఏఓ మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించి సందర్శకులకు మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఓటు వేయాల్సిన బాధ్యత గురించి వివరించే పాటలకు చిన్నారులు నృత్యాలు ప్రదర్శించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో వైఎస్‌ మనోహర్‌రెడ్డి, నాయకులు

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని రోటరీపురం 20వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు కొమ్మద్ది రసూల్‌, రహీం వారి కుటుంబ సభ్యులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. శ్రీకృష్ణదేవరాయల బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్‌, గాజుల బాబయ్య, కొమెర హరినాథ్‌, నరేష్‌కుమార్‌ ఆధ్వర్యంలో చేరిన వీరికి మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి, చైర్మన్‌ వరప్రసాద్‌, సివిల్‌సప్లై డైరెక్టర్‌ హాల్‌ గంగాధరరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రసూల్‌, రహీం కుటుంబ సభ్యులు, అన్వర్‌, మస్తాన్‌, శ్రీను, బాబాజీ, కిషోర్‌, రహంతుల్లా, మహమ్మద్‌, శ్రీధర్‌, బాబా ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ కోడిరమణ, మాజీ కోఆప్షన్‌ మెంబర్‌ దస్తగిరివల్లి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి



ప్రత్యేక అలంకరణలో శంకరాచార్యుల విగ్రహం

ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శంకరాచార్యుల విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం వేదపారాయణం, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరు కల్చరల్‌



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేదపండితులు, భక్తులు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- సామగ్రి తీసుకొచ్చిన వైనం
- ఏర్పాట్లు పూర్తి



జమ్మలమడుగు : సామగ్రిని పోలింగ్‌ కేంద్రాలకు తీసుకెళ్తున్న సిబ్బంది

జమ్మలమడుగు : పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్‌ కేంద్రాలలో ఓటింగ్‌ ప్రారంభం అవుతుండటంతో నియోజకవర్గంలోని 315 పోలింగ్‌ కేంద్రాలలో పోలింగ్‌ నిర్వహించటానికి సిద్ధమయ్యారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్‌ సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు పోలీసు బలగాలతో చేర్పించారు. ఆదివారం స్థానిక బాలికల జూనియర్‌ కాలేజీ నియోజకవర్గంలోని పోలింగ్‌ కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని రిటర్నింగ్‌ అధికారి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ఆర్‌ఓ శ్రీనివాస్‌ మాట్లాడుతూ పోలింగ్‌ నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా రాజకీయ పార్టీల ఏజెంట్ల సమన్వయంతో పోలింగ్‌ నిర్వహించాలన్నారు. ఏమైనా సమస్యలు వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

మహిళలే ఎక్కువ...

నియోజకవర్గంలో 2,40,835 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 1,23,751 మంది, పురుషులు 1,17,067 మంది, 17 మంది థర్డ్‌ జెండర్‌ ఉన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఓటర్లలో అత్యధికంగా 30 నుంచి 39 ఏళ్ల మధ్య 64,832 మంది ఓటర్లు ఉన్నారు. 40 నుంచి 49 మధ్య 49,879 మంది, 20-29 మధ్య 47402 మంది, 50-59 మధ్య 37102 మంది, 60-69 మధ్య 22636 మంది, 70 నుంచి 79 మధ్య 10744, 18-19 మధ్య కేవలం 5942 మంది ఓటర్లు ఉన్నారు. 80 ఏళ్ల పైబడి 2726 మంది ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా జమ్మలమడుగులో 62351 మంది ఓటర్లు ఉన్నారు. పెద్దముడియంలో 24892 మంది ఓటర్లు ఉండగా, 12167 మంది పురుషులు, 12724 మంది స్త్రీలు, 1 థర్డ్‌ జెండర్‌ ఉన్నారు. మైలవరం మండలంలో 32225 మంది ఓటర్లు ఉండగా, 15848 మంది పురుషులు, 16376 మంది స్త్రీలు, 1 థర్డ్‌ జెండర్‌ ఉన్నారు. జమ్మలమడుగు మండలంలో 62351 మంది ఓటర్లు ఉండగా, 30032 మంది పురుషులు, 32310 మంది స్త్రీలు, 9 మంది థర్డ్‌ జెండర్లు ఉన్నారు. కొండాపురం మండలంలో 34943 మంది ఓటర్లు ఉండగా, 16856 మంది పురుషులు, 18084 మంది స్త్రీలు, 3 థర్డ్‌ జెండర్లు ఉన్నారు. ముద్దనూరు మండలంలో 26972 మంది ఓటర్లు ఉండగా, 13101 మంది పురుషులు, 13869 మంది స్త్రీలు, 2 థర్డ్‌ జెండర్లు ఉన్నారు. ఎర్రగుంట్ల మండలంలో 59452 మంది ఓటర్లు ఉండగా, 30388 మంది పురుషులు, 29063 మంది స్త్రీలు, 1 థర్డ్‌ జెండర్‌ ఉన్నారు.

పరిశీలించిన అధికారులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని జరిగే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఏర్పాట్లపై తహసీల్దార్‌ సౌజన్యలక్ష్మీ, మున్సిపల్‌ కమిషనర్‌ రామక్రిష్ణయ్యలు పోలింగ్‌ కేంద్రాలను పర్యవేక్షణ చేశారు. మండల పరిధిలోని 79 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా అందులో 27 పోలింగ్‌ కేంద్రాలు యర్రగుంట్ల పట్టణంలో ఉన్నాయి. సాయంత్రానికి అన్ని పోలింగ్‌ కేంద్రాలకు పోలింగ్‌ సిబ్బంది చేరుకున్నారు. పోలీస్‌ శాఖ అధికారులు కూడా పోలింగ్‌ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షణ చేశారు.

పోలింగ్‌ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు

పెద్దముడియం : మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల్లో 34 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 25074 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు-12241, మహిళలు-12832, ఇతరులు-1 తమ ఓటు హక్కు ఉపయోగించుకోనున్నారు. పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌ సౌకర్యం, ర్యాంపులను సైతం ఏర్పాటు చేశారు. పోలింగ్‌ కేంద్రాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు బిగించి శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా 70 మంది పోలీసులతో బందోబస్తు సిద్ధం చేసినట్లు ఎస్‌ఐ రామక్రిష్ణ తెలిపారు. పోలింగ్‌ సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కౌసర్‌బాను

ప్రొద్దుటూరు : నియోజకవర్గ పరిధిలోని అర్హులైన వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కౌసర్‌బాను తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్‌ కళాశాల మైదానంలో ఆదివారం మధ్యాహ్నం ఎన్నికల సిబ్బందికి ఈవీఎం, వీవీప్యాట్లను అందించారు. సిబ్బందిని పోలింగ్‌ కేంద్రాలకు పంపించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్‌ అధికారి మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 268 పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో సోమవారం మొత్తం 2,47,966 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 141, రూరల్‌ పరిధిలో 94, రాజుపాళెం మండలంలో 33 పోలింగ్‌ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేకంగా మున్సిపాటీలో 173, రాజుపాళెం 15వ పోలింగ్‌ స్టేషన్‌ను ప్రత్యేకంగా మహిళల కోసం ఏర్పాటు చేశామని తెలిపారు. 81 పోలింగ్‌ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. 122 సాధారణ పోలింగ్‌ బూత్‌లుగా ఉన్నాయన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పీఓలు 268, ఏపీఓలు 268, ఓపీఓలు 1068, 54 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని వివరించారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిష్కారం కోసం ప్రత్యేకంగా బెల్‌ ఇంజినీర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఓటరు సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు విద్యాసాగర్‌, విజయశ్రీ, ఐసీడీఎస్‌ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌ శ్రీలక్ష్మి, ట్రైనీ ఆర్డీఓ సాయిప్రత్యూష, డిప్యూటీ తహసీల్దార్లు అజయ్‌బాబు, మనోహర్‌రెడ్డి, సుదర్శన్‌, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : పోలింగ్‌ సామగ్రిని సిబ్బందికి అందిస్తున్న అధికారులు



ఎర్రగుంట్ల : ఇల్లూరులో పోలింగ్‌ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరి



ప్రొద్దుటూరు : పోలింగ్‌ సామగ్రిని కేంద్రాలకు తీసుకెళుతున్న సిబ్బంది



జమ్మలమడుగు : సమావేశంలో మాట్లాడుతున్న కడప కమిషనర్‌

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



ముద్దనూరు : బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సెబ్‌ అదనపు ఎస్పీ వెంకటరాముడు, సీఐ, పోలీసులు



ప్రొద్దుటూరు క్రైం : దొరసానిపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్‌

ప్రొద్దుటూరు క్రైం : పోలింగ్‌ నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలైన కామనూరు, దొరసానిపల్లె గ్రామాలను జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలతో ఆయన మాట్లాడారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలు, భయానికి లోను కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఇందుకోసం పోలీస్‌ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దని, పోలీసు శాఖ అండగా ఉంటుందని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎస్పీ వెంట డీఎస్పీ మురళీధర్‌, రూరల్‌ సీఐ రమణారెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్‌లు ఉన్నారు.

గొడవలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు



ముద్దనూరు : మాట్లాడుతున్న సీఐ దస్తగిరి

ముద్దనూరు : ఎన్నికల రోజున ఎవరైనా గొడవలకు పాల్పడితే పోలీసుల నుంచి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సెబ్‌ అదనపు ఎస్పీ వెంకట్రాముడు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక సీఐ దస్తగిరి, సాయుధ బలగాలతో కలిసి మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరి ఓటు హక్కు వారు వినియోగించుకుని వెళ్లాలని, పోలింగ్‌ బూత్‌ల వద్ద అతిగా ప్రవరిస్తే ఉపేక్షించబోమని, ఫ్యాక్షన్‌ నేపథ్యం ఉన్న, సమస్యాత్మక గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పోలింగ్‌ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

శాంతియుత వాతావరణంలో..

సాధారణ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఆదివారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 38 పోలింగ్‌ బూత్‌లు ఉన్నాయని, వాటిలో 8 సమస్యాత్మక కేంద్రాలు గుర్తించినట్లు తెలిపారు. సాధారణ పోలీసులు కాకుండా అదనంగా సుమారు 100 మంది సాయుధ బలగాలను మండలానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం 27184 మంది ఓటర్లున్నారు. అందులో 13,186 మంది పురుషులు, 13997 మంది స్త్రీలు ఉన్నారు. ముద్దనూరు మేజర్‌ పంచాయతీలో అత్యధికంగా 7565మంది ఓటర్లు ఉన్నారు.

కామనూరులో స్వేచ్ఛగా పోలింగ్‌ జరిగేనా?



కామనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ స్టేషన్‌

ప్రొద్దుటూరు : టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి స్వగ్రామమైన కామనూరు గ్రామ పంచాయతీలో సాధారణ పోలింగ్‌ జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. వాస్తవానికి అధికారికంగా ఎప్పుడు ఇక్కడ స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించలేదు. వరదరాజులరెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా బలవంతంగా ఓట్లు వేసుకోవడం జరుగుతోంది. గతంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఏజెంట్లుగా కూర్చునేందుకు ప్రయత్నించినప్పుడు వారిపై దాడి చేశారు. ఈ కారణంగానే వరదరాజులరెడ్డిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం కామనూరు గ్రామానికి వెళ్లిన సందర్భంలో వరదరాజులరెడ్డి సోదరుడు రాఘవరెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రాచమల్లును ఎందుకు తమ గ్రామంలోకి రానిస్తున్నారన్నారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో సజావుగా పోలింగ్‌ జరిగేలా చూడాల్సిన అవసరం అధికారులపై ఉంది. వరదరాజులరెడ్డి ఇంటి పక్కనే ఉన్న రాధానగర్‌ పోలింగ్‌ స్టేషన్‌ 227లో 289 ఓట్లు, కామనూరు గ్రామంలోని 226 పోలింగ్‌ స్టేషన్‌లో 1000 ఓట్లు, నక్కలదిన్నె గ్రామంలోని 229 పోలింగ్‌ స్టేషన్‌లో 517 ఓట్లు కలిపి మొత్తం 1806 ఓట్లు ఉన్నాయి. పోలింగ్‌ సందర్భంగా కామనూరు గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయి. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీకి టీడీపీ కౌన్సిలర్‌ మద్దతు



తమ వర్గీయులతో కలసి మాట్లాడుతున్న 33వ వార్డు కౌన్సిలర్‌ గాజుల శివజ్యోతి, కుతుబుద్దీన్‌

ప్రొద్దుటూరు : ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో తమ మద్దతు వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీకేనని 33వ వార్డు కౌన్సిలర్‌ గాజుల శివజ్యోతి, ఆమె భర్త టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్‌ తెలిపారు. తమ కార్యాలయంలో వారు ఆదివారం మీడియాతో మాట్లాడారు. టీడీపీలో ఉన్న తమను 10 నెలల క్రితం సస్పెండ్‌ చేయడం జరిగిందని, తీరా ఎన్నికలు వచ్చాక ఆ సస్పెండ్‌ ఎత్తేశారన్నారు. తమకు గుర్తింపులేని పార్టీలో ఉండటం ఎందుకని తమ వర్గీయులతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఎన్‌ఆర్‌సీని వ్యతిరేకించింది సీఎం జగన్‌

రాష్ట్రంలో ఎన్‌ఆర్‌సీ అమలు కాకుండా ముస్లింలకు మద్దతుగా నిలిచిన నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌ మాత్రమేనని కౌన్సిలర్‌ శివజ్యోతి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని సీఎం ప్రకటించారన్నారు. ఎన్డీఏ కూటమిలో ఉన్న చంద్రబాబు ముస్లింలకు అనుకూలంగా వ్యవహరించే ప్రసక్తే లేదన్నారు. పొత్తు కారణంగా ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్‌కు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డుల్లో తమ వార్డులో మాత్రమే టీడీపీ గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు.

వాహనాల తనిఖీ



గోపాయపల్లె చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజుపాళెం : మండల పరిధిలోని గోపాయపల్లె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌ పోస్టులో ఆదివారం అధికారులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. వైఎస్సార్‌ జిల్లా, నంద్యాల జిల్లా సరిహద్దులో ఈ చెక్‌ పోస్టును ఏర్పాటు చేయడంతో ఆ దారిలో వెళ్లే వాహనాలన్నీ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతున్నాయి, వాహనాల నంబర్లను, తదితర వివరాలను పోలీసులు నమోదు చేసుకుంటున్నారు. కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాల్లో ఉన్న బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటయ్య, పోలీసులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు

రాజుపాళెం మండలంలో సోమవారం జరగబోవు పార్లమెంట్‌, అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్‌ అధికారులు సర్వం సిద్ధం చేశారు. రాజుపాళెం మండల వ్యాప్తంగా 33 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 25,146 మంది ఓటర్లలో పురుషులు 12,261, మహిళలు 12,885 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో ఏడుగురు పోలింగ్‌ సిబ్బంది నియమించారు. ఆదివారం సాయంత్రానికి పోలింగ్‌ కేంద్రాల వద్ద షామియానాలు, బారికేడ్లను ఏర్పాటు చేశారు.

ఓట్ల పండుగకు సర్వం సిద్ధం

ఘనంగా శంకరాచార్యుల జయంతి



ప్రత్యేక అలంకరణలో శంకరాచార్యుల విగ్రహం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున శంకరాచార్యుల విగ్రహానికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం వేదపారాయణం, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆదర్శ పోలింగ్ కేంద్రం 'లక్ష్మీపేట'



చాపాడు: లక్ష్మీపేటలో రిటర్నింగ్ అధికారులు ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ కేంద్రం

చాపాడు: మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని మైదుకూరు నియోజకవర్గంలోని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు మోడల్ పోలింగ్ సెంటర్‌గా తయారు చేశారు. లక్ష్మీపేట గ్రామంలో అధికంగా విద్యావంతులు ఉండటంతో పాటు గతంలో జరిగిన వివిధ రకాలైన ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు జరగకపోవటంతో లక్ష్మీపేటను ఆదర్శ పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసినట్లు రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. ఎన్నికల అధికారులు ఆదేశాల మేరకు ఆదివారం పోలింగ్ కేంద్రాన్ని నమూనా రూపంలో తీర్చిదిద్దారు. ఆదర్శ పోలింగ్ కేంద్రం నమూనా తయారు చేయటంతో పాటు గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు.

సోమవారం జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరుపుకోవాలని రిటర్నింగ్ అధికారి కోరారు.



పోలింగ్ కేంద్రాన్ని ముస్తాబు చేసిన అధికారులు



చాపాడు: సీబీఐటీలో ఎన్నికల విధుల నియామకంలో ఎన్నికల సిబ్బంది



అట్లూరు: పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

- మైదుకూరు నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- 2,11, 855 మంది ఓటర్లు
- బద్వేలు నియోజకవర్గంలో 272 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- 2,19,290 మంది ఓటర్లు

చాపాడు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మైదుకూరు నియోజకవర్గంలో సోమవారం జరుగనున్న పోలింగ్‌కు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. స్థానిక సీబీఐటీ కాలేజీలో రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి ఎన్నికల నియమాల పట్ల సమావేశం నిర్వహించి, పోలింగ్ సామాగ్రిని అందజేసి పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సుల ద్వారా తరలించారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలు, మున్సిపాలిటీలో 269 కేంద్రాలలో 2,11,855 మంది ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం పోలింగ్ ఆఫీసర్‌తో పాటు ఏడు మంది చొప్పున 269 బూతులలో 1,883 మందిని ఏర్పాటు చేయగా వీరికి అదనంగా 623 మంది రిజర్వుడులో ఉంచారు. వీరితో పాటు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఇద్దరు చొప్పున పోలీసులను బందోబస్తుగా నియమించారు. వీరితో పాటు మొబైల్ పోలీసు టీంను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ప్రత్యేక పోలీసు బలగాలను అందుబాటులో ఉంచారు. ఒక రోజు ముందే జిల్లా ఎస్పీ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా గ్రామాల ప్రజలతో సమావేశాలు నిర్వహించి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

ఏర్పాట్లను పరిశీలించిన జనరల్ అబ్జర్వర్, ఆర్‌ఓ

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలో సోమవారం జరగనున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని బాలయోగి గురుకుల పాఠశాలలో ఆదివారం ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని అందజేశారు. జోనల్ అబ్జర్వర్ భానుదాస్‌పాల్వే, నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆకుల వెంకటరమణల పర్యవేక్షణలో ఆయా బూత్‌ల పోలింగ్ అధికారులకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఇతర సామాగ్రిని అందజేశారు. నియోజకవర్గంలోని 272 పోలింగ్ బూత్‌లలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు 272 మంది పీఓలు, 272 మంది ఏపీఓలు, 1088 మంది ఓపీఓల చొప్పున మొత్తం 1632 మందిని, మరో 75 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. మొత్తం 28 సెక్టార్లలో 28 మంది రూట్ అధికారులను నియమించారు. 272 బూత్‌లకు గాను 184 బూత్‌లలో వెబ్‌కాస్టింగ్, 98 బూత్‌లలో వీడియోగ్రఫీ ఏర్పాటు చేశారు. పోలింగ్ సామాగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఆర్టీసీ బస్సులలో తరలించారు. అనంతరం ఈవీఎంలలో తలెత్తే సాధారణ సమస్యలు, వాటి పరిష్కారం విషయమై పీఓ, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం జోనల్ అబ్జర్వర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి మాట్లాడుతూ పోలింగ్‌ను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎలాంటి సమస్యలు వచ్చినా తమను వెంటనే సంప్రదించాలని కోరారు.

భారీ పోలీసు బందోబస్తు

నియోజకవర్గంలోని 272 పోలింగ్ బూత్‌లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 39 రూట్ మొబైల్ టీంలు ఏర్పాటు చేశారు. అలాగే ఒక డీఎస్పీ, 5 మంది సీఐలు, 16 మంది ఎస్‌ఐలు, 14 మంది ఏఎస్‌ఐలు, 41 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, 110 కానిస్టేబుళ్ళు, 80 మంది హోంగార్డులు, 60 మంది ఏఆర్ పోలీసులు, 50 మంది తమిళనాడు పోలీసులు, 70 మంది గుజరాత్ స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ చొప్పున మొత్తం 447 మంది పోలీసులను విధులకు నియమించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్, డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద, పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

గోపవరం : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మండలంలో 18 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 14324 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బద్వేలు నియోజకవర్గంలో..

అట్లూరు: నేడు జరగనున్న అసెంబ్లీతో పాటు పార్లమెంటు ఎన్నికలకు సంభందించి ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. బద్వేలు నియోజకవర్గంలో బద్వేలు మున్సిపాలిటీతో పాటు బద్వేలు రూరల్, అట్లూరు, గోపవరం, బి కోడూరు, పోరుమామిళ్ల, కలసపాడు కాశినాయన మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని 2,19,290 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళా ఓటర్లు 1,10,12 మంది. పురుషులు 1,09,163 మంది. ట్రాన్స్‌జెండర్స్ ఐదుగురు ఉన్నారు. నియోజకవర్గం 272 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

బి.కోడూరు : నేడు జరగబోయే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మండలంలో మొత్తం 22 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఓటర్లకు వేసవిని దృష్టిలో ఉంచుకుని చలువ పందిర్లతో పాటు పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు బి.కోడూరు ఎస్‌ఐ జయరాములుతో పాటు 8 మంది ఎస్‌ఐలు, 6 మొబైల్ టీంలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన అంకనగొడుగునూరు, తంగేడుపల్లె, తుమ్మలపల్లె, మున్నెల్లి పోలింగ్ బూత్‌లలో సీసీకెమెరాలను ఏర్పాటు చేశారు.



కాశినాయన : ఆకులనారాయణపల్లె పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలువపందిళ్ళు



బద్వేలులో పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా అలంకరించిన దృశ్యం

కలసపాడు మండలంలో..

కలసపాడు : నేడు జరగబోయే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం 25,268 మంది ఓటర్లు ఉన్నారు. ఆదివారం సాయంత్రం అన్ని పోలింగ్ బూత్‌లకు పోలింగ్ అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చలువపందిళ్లు, వసతులు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగమురళి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు పోలింగ్ అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చలువపందిళ్ళు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. మండలంలో 27 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ జరగనుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



బద్వేలు అర్బన్ : సిబ్బందికి సూచనలిస్తున్న జనరల్ అబ్జర్వర్, ఆర్‌ఓ



బద్వేలు అర్బన్ : పోలింగ్ విధులలో పాల్గొనేందుకు తరలివచ్చిన సిబ్బంది



బద్వేలు అర్బన్ : పోలీసులకు సూచనలిస్తున్న నోడల్ ఆఫీసర్